క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల జెడ్పీహెచ్ పాఠశాలలో గురుపౌర్ణమి సందర్భంగా శ్రీకృష్ణ సాయిమందిరం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, టూత్ బ్రష్‌లు తదితర వస్తువులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సాయి మందిరం సభ్యులు ఎన్. సులోచన, శ్రీదేవి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ ఎం ఎ.సుబ్బారావు, ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, ఏడుకొండలు, నాగరాజు, పీఈటీ ఏసురాజు పాల్గొన్నారు.

నాదెండ్లలో..

కనపర్రు టీసీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నరసరావుపేట ప్రకాష్‌నగర్ సాయి బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.10 వేలు విలువైన నోట్ పుస్తకాలు, పలకలు, జామెట్రీ బాక్సులు తదితర విద్యా సామగ్రి అందించారు. హెచ్ఎం వై. రాజ్యలక్ష్మి, ట్రస్ట్ చైర్మన్ ఎం. గోపాలరావు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా చిలకలూరిపేట, నరసరావుపేట ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రమేష్, బలరాం, ఉపాధ్యాయులు రాఘవయ్య, శైలజ, పేరిరెడ్డి పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల జీవనోపాధులకు ప్రాధాన్యత

బొల్లాపల్లి: డ్వాక్రా మహిళల జీవనోపాధులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెలుగు పథకం ఏపీఎం రంగారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం వీవోఏలకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ జీవనోపాధుల కింద డ్వాక్రా సంఘాల అభివృద్ధికి స్త్రీనిధి, ఉన్నతిలో రుణాలు, పొట్టేళ్లు, గేదెలు పంపిణీతో పాటు సబ్సిడీ రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. మండలానికి 40 యూనిట్లు జీవాలు, వంద గేదెలు మంజూరయ్యాయని తెలిపారు. సమీక్షలో సీసీ కృష్ణ, వీవోఏలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నరసరావుపేట టౌన్: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ సోమవారం తెలిపారు. ఇరుకుపాలెం గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక పట్టణంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ విద్యను అభ్యసిస్తోంది. ఆదివారం హాస్టల్ నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమతులు లేని ట్రాక్టర్ సీజ్

నరసరావుపేట టౌన్: ప్రజలకు అసౌకర్యాన్ని గురిచేస్తూ పట్టణంలో సంచరిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు సోమవారం తెలిపారు. గత కొన్ని రోజులుగా ఓ రాజకీయ పార్టీకి సంబంధించి ప్రచారం నిర్వహిస్తూ, లౌడ్ స్పీకర్లతో ట్రాక్టర్ సంచరిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో మైకు ఎక్కువగా సౌండ్ పెడుతుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అక్కడికి చేరుకొని ట్రాక్టర్ నిర్వాహకుడ్ని విచారించగా ఎటువంటి అనుమతులు తీసుకోలేదని తెలిసింది. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. లౌడ్ స్పీకర్లు పెట్టి ప్రజలకు అసౌకర్యానికి గురిచేస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. పోలీస్ శాఖ ముందస్తు అనుమతులు ఉంటేనే వాహనాలు తిరిగేందుకు అంగీకరిస్తామని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన హెచ్ఎం మోహిద్దీన్ సాహెబ్, ఉపాధ్యాయులు ఎస్. నాగేశ్వరరావు, డి. సంజయ్‌కుమార్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోహిద్దీన్ సాహెబ్ మాట్లాడుతూ పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, అధికారులు, రాజకీయ నాయకులు సహకారం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమకు సహకరించి పిల్లల్ని సక్రమంగా బడికి పంపడం వల్లే ఎక్కువ ఉత్తీర్ణత శాతాన్ని తేగలిగామని వివరించారు. ఈ సందర్భంగా నూతనంగా హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టిన షేక్ సుభానీని, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తవనం రామిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బేగం, సునీత, రత్నజ్యోతితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై ఇంట్లో సామగ్రి దగ్ధం

యడ్లపాడు: సిలిండర్ లీకై ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి యడ్లపాడు మండలం కొండవీడులో జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివసించే కట్టా సురేష్ భార్య రాత్రి 8:30 గంటల సమయంలో వంట చేసేందుకు సమాయత్తం అయింది. లైటర్‌తో స్టవ్‌ను ముట్టించే ప్రయత్నం చేయగా, అప్పటికే సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా ఇల్లంతా మంటలు వ్యాపించాయి. దీంతో లైటర్‌ను అక్కడే పడేసి కుటుంబ సభ్యులంతా బయటకు పరుగులు దీశారు. చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కాలనీవాసులు పరుగున వచ్చి తడిపిన గోనె సంచుల్ని సిలిండర్‌పై కప్పి, మంటలున్న చోట మట్టి, ఇసుకను చల్లి గంటసేపటి తర్వాత అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని టీవీ, మంచాలు, దుస్తులు, గృహోపకరణ వస్తువులతో పాటు ఆధార్, రేషన్, విద్య సంబంధిత సర్టిఫికెట్లు కాలిపోయినట్లు తెలిపారు.

జగనన్న సురక్ష.. రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష

- మంత్రి విడదల రజిని
- లబ్ధిదారులకు వివిధ శాఖల సేవల ధ్రువపత్రాల అందజేత



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి రజిని

యడ్లపాడు: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నిరుపేద ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. యడ్లపాడులోని సచివాలయం -2 పరిధిలో జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించిన తొలిరోజు నుంచే ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంతో ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్వర పరిష్కారాలు..

సచివాలయం పరిధిలో వారం రోజులుగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి తెలుసుకున్న సమస్యలకు పరిష్కారం చూపారు. మొత్తం 151 సేవా పనులకు సత్వర పరిష్కారం చూపారు. ఆయా సేవల్లో కుల -64, ఆదాయ -63, ఫ్యామిలీ -1, కొత్త రేషన్, సవరణలు -7, ఆధార్ కార్డులకు మొబైల్ లింక్ -10, ఇతర సర్టిఫికెట్లు -12, రేషన్ కార్డుల్లో సభ్యుల తొలగింపులు -4 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు మంత్రి విడదల రజిని పంపిణీ చేశారు. రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం కింద కంది సాగును ప్రోత్సహించే దిశగా వంద శాతం రాయితీపై కంది మినీ కిట్స్‌ను, 31 మందికి కౌలు రైతు గుర్తింపు కార్డులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఎంపీపీ పి. ఝాన్సీ, సర్పంచ్ కె.హేమ, ఎంపీటీసీ సభ్యుడు అరుణ్‌కుమార్, సొసైటీ చైర్మన్ బి. శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గంటా శంకర్, కల్లూరి విజయ్‌కుమార్, రాచమంటి చింతారావు, మాదం శ్రీను, కె. సుబ్బారావుతో కలసి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎ. శ్యాంపాల్, కె. శామ్యేల్ పాల్, పి. బుల్లెబ్బాయ్, షంషుజుహా, ఎం.వి.బాలచంద్రారెడ్డి, వి. శ్రీనివాసనాయక్, దయాసాగర్, తహసీల్దార్ ఎస్. నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై. హనుమారెడ్డి, ఏవో సరిత, ఎంఈవో-1 ఎం.వి.నాగరత్నం, ఐసీడీఎస్ ఏసీడీవో సూపర్‌వైజర్ ఎం. జోజమ్మ పాల్గొన్నారు.

జగనన్న సుపరిపాలనతో ప్రజలందరికీ మేలు: మంత్రి రజిని

ప్రజలకు మేలు చేయాలన్న తపనతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. యడ్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపలోనూ మంత్రి రజినీని తోబుట్టువులా మహిళలు ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో కలిగిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామంలోని బీసీలు శ్మశానవాటిక అవస్థలు తన దృష్టికి తెచ్చారని, దశాబ్దాలుగా నెలకొన్న ఆ సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ ఎం. వీరారెడ్డి, మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్న, ఎంపీపీ పి. ఝాన్సీ, సర్పంచ్ రావూరి వేణుగోపాలరావు, పార్టీ సీనియర్ నాయకులు గంటా శంకర్, నాయకులు వడ్లాన అంకమ్మరావు, పావులూరి శ్రీనివాస్, పిడతల మార్తమ్మ, బుల్లిబాబు, తాళ్లూరి చిన్నారి, మేడిద మోహన్‌రావు, షేక్ మస్తాన్, వల్లూరి కోటేశ్వరరావు, అన్నవరపు హరిబాబు, వడ్లాన అంకమ్మరావు, వడ్లాన రాజేశ్వరరావు, చంద్రం, దయాసాగర్, సొసైటీ చైర్మన్ శివరామకృష్ణ, న్యాయవాది దాసరి చిట్టిబాబు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పలు పథకాలు



విఠంరాజుపల్లి గ్రామసభలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ జయశ్రీ, అధికారులు

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్షలో భాగంగా మండలంలోని విఠంరాజుపల్లి లో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీ పగడాల జయశ్రీ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాల్ని ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్ని ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమం నెల రోజుల పాటు జరుగుతుందని, గ్రామస్తులంతా వలంటీర్ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం 95 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి. సుమలత, జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, ఉప సర్పంచ్ రామిరెడ్డి, ఎంపీడీవో మంగాపురనాథ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఈవోపీఆర్డీ మోహన్‌చంద్ పాల్గొన్నారు.

17న ఉపాధి పనులపై ప్రజా వేదిక



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం ఉపాధి పథకం పనులపై ఆడిట్ నిర్వహించాలని ఎంపీడీవో కె.మ్యాథ్యూబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. 15వ విడత సోషల్ ఆడిట్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సోషల్ ఆడిట్ వివరాల్ని నివేదిక రూపంలో కార్యాలయంలో అందజేయాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో సోషల్ ఆడిట్‌లో వచ్చిన అంశాలపై ఈ నెల 17న ప్రజావేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సైకం జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కోట ప్రసాద్, ఎస్సార్పీ టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీ గురుభ్యోనమః

పలు ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు



సాయినాథుడికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు



బరంపేట ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీరాధాగోవిందులు



విఠంరాజుపల్లిలోని బాబా మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

నాదెండ్ల: క్లస్టర్ పరిధిలో సోమవారం పలు ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గణపవరం గ్రామ పరిధిలోని శివప్రియ నగర్‌లో గల ఆదిపరాశక్తి క్షేత్రం గండి పోచమ్మ ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ నిత్య విద్యానంద భారతీస్వామి గురుపౌర్ణమి విశిష్టతను వివరించారు.

- చిలకలూరిపేట నూతన మార్కెట్ యార్డు సమీపంలోని షిర్డీ సాయి సేవాశ్రమంలో సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యూపీ శివరామయ్య, శిఖాకొల్లి పాపారావు, కమిటీ సభ్యులు మద్ది సామ్రాజ్యమ్మ పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతుల పూజలు

నరసరావుపేట ఈస్ట్: గురు పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సుస్మితారెడ్డి దంపతులు పాల్గొన్నారు. సాయినాథుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు భాగవతుల లక్ష్మీనారాయణబాబు పాల్గొన్నారు.

- బరంపేటలోని ఇస్కాన్ మందిరంలో రాధాగోవిందులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.
- ప్రకాష్‌నగర్‌లోని శ్రీసాయి క్షేత్రంలో కమిటీ ప్రతినిధి మురారిశెట్టి గోపాలబాబు పర్యవేక్షణలో సాయినాథుడికి అర్చనలు, హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

బాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పలు దేవాలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్, ఎన్ఎస్పీ కాలనీ, విఠంరాజుపల్లి సమీపంలోని బాబా మందిరాల్లో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. బోసు బొమ్మ సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో 108 లీటర్ల ఆవుపాలతో విశేష అభిషేకం, సహస్ర ఘటాభిషేకం, సామూహిక సాయి సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

శావల్యాపురంలో..

మండలంలోని వేల్పూరు, కారుమంచి గ్రామాల్లోని బాబా మందిరాలలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కారుమంచిలో మందిర పూజారి రాచపూడి రాఘవరావు ఆధ్వర్యంలో బాబాకు విశేష పూజలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నదానం నిర్వహించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

- వేల్పూరులో ఆలయ ధర్మకర్త చిరుమామిళ్ళ వెంకట ప్రసాద్, మల్లేశ్వరి దంపతులు కుటుంబ సమేతంగా బాబాను దర్శించుకున్నారు. పూజారి ప్రసాద్ సారథ్యంలో బాబా మూల విరాట్‌ను నూతన వస్త్రాలు, పూలదండలు, వెండి అభరణాలతో అలంకరించారు.

బాబాకు విశేష అలంకరణ

రొంపిచర్ల:మండలంలో సోమవారం గురు పౌర్ణమి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక హైవే రోడ్డు పక్కన ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో బాబాను విశేషంగా అలంకరించారు. విశేష, సహస్రనామ, కుంకుమార్చన, అలంకరణ పూజలు నిర్వహించారు. పరిసర గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తహసీల్దార్ జి.అంకారావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి, గ్రామ మాజీ సర్పంచులు పడాల చక్రారెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, వివిధ శాఖల అధికారులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

అజ్ఞాన చీకట్లను పారదోలే దివ్య చైతన్య స్ఫూర్తి గురువు



తుర్లపాడులో సాయినాథుడి సేవలో మంత్రి విడదల రజిని

యడ్లపాడు: అజ్ఞాన చీకట్లను జ్ఞానకాంతులతో పారదోలే దివ్య చైతన్య స్ఫూర్తిగా గురువును అభివర్ణిస్తారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. యడ్లపాడు మండలం తుర్లపాడులో సోమవారం గురుపౌర్ణమి పురస్కరించుకుని స్థానిక షిర్డీ సాయిబాబా మందిరాన్ని ఆమె సందర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేదాల్ని సామాన్యుల చెంతకు చేర్చిన మహోన్నత వ్యక్తి వ్యాస మహర్షి అన్నారు. ఆయన జన్మించిన రోజునే గురు పౌర్ణమి లేదా వ్యాస పూర్ణిమగా జరుపుకుంటారని ఆమె వివరించారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి అంబటి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. మండలంలోని పెట్లూరివారిపాలెంలో రూ.55లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పెట్లూరివారిపాలెంలోని ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాజ్యసభ మాజీ సభ్యుడు కె.వి.పి. రామచంద్రరావు సహకారం అందించడం అభినందనీయమని తెలిపారు. అమ్మమ్మ కటికినేని గోపయమ్మ జ్ఞాపకార్థం సొంత నిధులు రూ.25లక్షలను ఆయన అందించినట్లు తెలిపారు. హైవేకు పక్కనే ఉన్న స్థలంలో చేపడుతున్న కమ్యూనిటీ హాల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పెట్లూరివారిపాలెంతో కేవీపీ రామచంద్రరావుకు ఎంతో అనుబంధం ఉందన్నారు. ఈ కారణంతోనే కాలనీవాసులు అడిగిన వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సొంత నిధులతో పాటు రూ.35లక్షల జిల్లా మినరల్ ఫండ్‌ను కేటాయించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ మేకల మురళీ మోహనరావు, కె.కృష్ణయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: సంక్షేమంతో పాటు అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. పట్టణంలోని 18, 21, 26, 27 వార్డుల పరిధిలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. సంబంధిత వార్డుల పరిధిలోని దాసరి కాలనీ, భగత్‌సింగ్ రోడ్డుల్లో ఆర్‌సీ కల్వర్టులు, పట్టల బజారు, వేజండ్ల వారి వీధిలో సీసీ రోడ్లు, బచ్చు సత్యానారాయణ నగర్‌లో ఆర్‌సీ కల్వర్టు, వెంకటాచారినగర్‌లో సీసీ డ్రైయిన్‌తో పాటు రూ. 34లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రఫాని మాట్లాడుతూ పట్టణ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వార్డుల పరిధిలో అవసరాల్ని గుర్తించి పనులు చేపడతామని వెల్లడించారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఆయా వార్డుల కౌన్సిలర్లు షేక్ నాయబ్ సైదాబి, చెంబేటి భారతి, అన్నపరెడ్డి శ్రీలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్. గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ పాల్గొన్నారు.

దూర ప్రయాణాల్లో రానూపోనూ టికెట్లు కొంటే రాయితీ



గ్యారేజీని పరిశీలిస్తున్న ఈడీ ఆదాం సాహెబ్

వినుకొండ టౌన్: ఎక్కువ దూరం ప్రయాణం చేసే ఆర్టీసీ బస్సులకు రానూపోనూ టికెట్ల ధరల్లో 10శాతం రాయితీని ప్రయాణికులకు అందిస్తున్నామని నెల్లూరు డివిజన్ ఈడీ ఆదాం సాహెబ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఆర్టీసీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2500 కొత్త బస్సులను తీసుకోబోతున్నామని, ఇందులో సొంతగా 1500 బస్సుల్ని కొనుగోలు చేస్తుండగా, అద్దె ప్రాతిపదికన 1000 బస్సులు తీసుకునేందుకు త్వరలో టెండర్లను పిలుస్తామని చెప్పారు. రానున్న వర్షాకాలంలో ప్రమాదాల నివారణ కోసం డ్రైవర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. బస్సుల పైకప్పులు కారకుండా, వైపర్లు బాగా పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బస్టాండ్లలో మౌలిక సదుపాయాల కోసం చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తొలుత డిపోను, గ్యారేజీని సిబ్బందితో కలసి పరిశీలించారు. ఆయన వెంట డిపో మేనేజర్ కోటేశ్వరరావునాయక్, సిబ్బంది ఉన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



నరసరావుపేట టౌన్: గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నకరికల్లు శివారు చోటుచేసుకుంది. నకరికల్లు సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం పడిఉందన్న సమాచారం శావల్యాపురం స్టేషన్ మాస్టర్ అందించారు. దీంతో సీఐ టి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు నకరికల్లుకు చెందిన యర్రంశెట్టి మల్లికార్జున(29)గా గుర్తించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



పునీత్ సాగర్ ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లయ్య, మేజర్ రాజు తదితరులు

నరసరావుపేట ఈస్ట్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతూ, నీటి సంరక్షణపై బాధ్యతతో వ్యవహరించాలని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్‌లో భాగంగా నిర్వహించిన పునీత్ సాగర్ అభయాన్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భూగోళం నేడు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నదని, పర్యావరణ పరిరక్షణ చేపట్టాలని కోరారు. సముద్రాలు, నదులు, సరస్సులు, మంచినీటి గుంతలను శుద్ధి పరిచేందుకు చేపట్టిన పునీత్ సాగర్ అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై స్వచ్ఛమైన నీటిని భావితరాలకు అందించాలని తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.ఆర్.కె. రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్మీడియేట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వ్యతిరేక నినాదాలు చేశారు. నీటి వనరుల్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

ఘనంగా మెకానిక్ డే

నరసరావుపేట: పట్టణంలోని అరండల్‌పేట అచ్చిరెడ్డి కాంప్లెక్స్ వద్ద సోమవారం మెకానిక్ డేను ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు కేకు కట్ చేసి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అన్నదానం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని స్పందనలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు టూ వీలర్ మెకానిక్‌ల సమస్యలపై వినతిపత్రం అందించారు. కలెక్టర్ మెకానిక్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ టూ వీలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎగ్జిక్యూట్ మెంబర్ బాజీ మేస్త్రి, జిల్లా మాజీ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ మస్తాన్‌వలి, టౌన్ మాజీ ప్రెసిడెంట్ సయ్యద్ మస్తాన్‌వలి, మాజీ ప్రెసిడెంట్ సుభాని, సభ్యులు సుభాని, బాజీ పాల్గొన్నారు.

యడ్లపాడు ఎంఈవో -1 గా నాగరత్నం

యడ్లపాడు: మండల విద్యాశాఖాధికారి -1గా మదిర వెంకట నాగరత్నం సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2000లో స్కూల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె బదిలీల్లో భాగంగా హెచ్ఎంగా పదోన్నతి పొంది చేబ్రోలు, వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేశారు. ఇటీవల ప్రభుత్వం హెచ్ఎంలకు ఎంఈవో -1గా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ నేపథ్యంలో ఆదివారం గుంటూరు ఆర్జేడీ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌లో యడ్లపాడు ఎంఈవో-1గా నాగరత్నం నియమితులయ్యారు. నియామక పత్రాన్ని సోమవారం ఎంపీడీవో వై. హనుమారెడ్డికి సమర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: గణపవరం, సాతులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్. అశోక్‌కుమార్ తెలిపారు. గణపవరంలోని పరిశ్రమలు, వేలూరు రోడ్డు, యడ్లపాడు మండల పరిధిలోని తిమ్మాపురం పరిశ్రమలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదని పేర్కొన్నారు. నాదెండ్ల మండల పరిధిలోని సాతులూరు, చందవరం, గొరిజవోలు, డెయిరీ ఇండస్ట్రీ, పెయింట్ గోడౌన్స్, నరసరావుపేట రూరల్ మండలం దొండపాడు, పానుగుపాడు, వ్యవసాయ, వాణిజ్య, చిన్నతరహా పరిశ్రమలకు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలియజేశారు.

8న హలో మాదిగ..చలో నరసరావుపేట

నరసరావుపేట: పట్టణంలోని ఎన్‌జీవో హోంలో ఈనెల 8న ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ పాల్గొనే హలో మాదిగ..చలో నరసరావుపేట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ కనుమూరి కోటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగురి నాగరాజు మాదిగ కోరారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట ఎన్జీవో హోంలో 8వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు సన్నాహక సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

మతుకుమల్లి పంచాయతీ కార్యదర్శిగా సూరి

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి పంచాయతీ కార్యదర్శిగా టి. శేషుమని సూరి బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు శానంపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్ అదనపు బాధ్యతలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.